# లవ్ ఇన్ లబ్బీపేట....

నెత్తురు కారకుండా, గాయం కనపడకుండా కుంచెతో ఖూనీలు చేయగల్రు ఆర్టిస్టులు, చెడ్డవాళ్ళకు సుఖాలు, మంచివాళ్ళకు కష్టాలూ వచ్చినట్లు చెడ్డ కథలకి మంచి బొమ్మలూ మంచి కథలకి చెడ్డబొమ్మలూ వస్తూంటాయి, ఏ ఎండ కా గొడుగుపట్టినట్లు, ఏ కథకుతగ్గబొమ్మ ఆకథకు వేస్తుంటారు. ఆర్టిస్టులు ట్విస్టులుకూడా చేస్తారు. గిట్టనివాళ్ళ కథలకు గిట్టని బొమ్మలు వేస్తూంటారు. రచయితల్నికూడా నమ్మకూడదు. రాసిన కథల్నే మళ్ళీమళ్ళీరాసి ప్లాటుమార్చకుండా ప్లేటు తిరగేస్తూ వుంటారు, ఎన్ని ప్లేట్లు మార్చినా ఆ కథ అచ్చుగాకపోతే దాన్ని పాతిపెడితే భూమిలోభూమి సారం అంతా అది పీల్చేసి కథల చెట్టయి మూడు కథలూ ఆరునవల్లూ లేదా మూడు నాటకాలూ, ఆరు సినిమాలుగా వర్ధిల్లుతుంది. కథల్ని పాతరవేసి పూరబెట్టడం అదో టెక్నిక్. సంచీ నిండా కథలేసుగుని పొద్దున్నే భవతీ భిక్షాందేహి అని వీధినపడకూడదు. పత్రికలే రచయితల వెంటపడాలి. సంచీడు కథలు రాసేవాడికి. గంపెడు పిల్లలున్న వాడికి ఈ రూలు వర్తించదు, చక్కగా దో, యాతీన్ ఏడాదికి రెండు మూడు కథలు రాసేవాడు వాటిని మహారాజులా చెల్లుబెట్టుకోగలడు, వ్యథలెక్కువయిన కొద్ది కథలెక్కువవుతాయి, సంచీడు కథలు రాసినవాడు కుటుంబ భారంతో కృంగిపోయినట్లు కథల బరువుతో కృంగిపోతాడు. సంచీలాభం చిల్లు కూడదీస్తుందేమోనని ఆశపడితే కథల నంచీకి చిల్లుండదు, ఎవడు వేస్తాడో ఎవడు వెయ్యడో ఎవడు దేని పీకమీద కాలేస్తాడో - అని గుండె కొట్టుకుంటూ వుంటుంది. కథ లెక్కువయిన కొద్దీ తాపత్రయం ఎక్కువ, ఇందులో మళ్ళీ చిన్న ట్రాజడీ వుంది.

ఎక్కువ కథల్రాసిన వాడికి ఎక్కువ కీర్తిరాదు, పది కథల్రాసిన వాడి కొచ్చిన కీర్తి వెయ్యి కథల్రాసిన వాడికి రాకపోవచ్చును. అంచేత కథల నియంత్రణం పెట్టాలి ఫామిలీ ప్లానింగులా. సంవత్సరానికి ఆరు కథలు రాసినవాడు ఆరోగ్య వంతుడు. నెలకు ఆరుకథలు రాసేవాడికి బ్లడ్ ప్రెజరు రావచ్చును! నాటకాలు వేయడం కంటే సినిమాల్లో చేరడం మంచిదైనట్లు, కథల్రాయడం కంటే నవలల్రాయడం మంచిది.

గారెల్లో నేతిగారెలు, పెరుగు గారెలు, మసాలా గారెలున్నట్లు కథల్లో ప్రేమ కథలూ, ప్రేమ కథలు కానివి, అని రెండే రకాలు. తెలిసి తెలిసి దీపం పురుగులు నిప్పులో కురికినట్లు ప్రేమకథలు రాయడం కష్టమని తెలిసే అందులోకి వురకడం మానరు జనం. ప్రేమ సుగర్ కోటెడ్ పిల్ (పిల్లకాదు) లాటిది. లోపల చాలా బిట్టర్‌గా వుంటుంది.

ప్రేమలో నిషా వుంటుంది కాని తియ్యదనం ఉండదు, ప్రేమలో పడ్డవాళ్ళు అంటువ్యాధి సోకిన మనుషుల్లా వుంటారు కాని దేవతల్లా కన బడరు. అది గుండెల్ని నమిలేసే వ్యాధి - దానికి పెద్దవాళ్ళు కొన్ని ఇంజక్షన్లు కని పెట్టారు. ప్రేమకి పెద్ద పర్‌గెటివ్ "పెళ్ళి". లవ్ ఇన్ లక్ష్మీపేట ఆర్ బందరు రోడ్డు అని బయల్దేరిన కథానాయకుడికి పెళ్ళి చేసేస్తే నెక్ట్స మినిట్ ఇంటి పిచ్చికో ఇంటి పక్షో అయిపోతాడు. పెళ్ళయిపోగానే హీరో డవునంటీ - వ్వాట్ నెక్ట్స, నర్సింగ్ హోమో పెద్దాసుపత్రో .... పాలడబ్బాలో, బారసాలలో.... ప్రేమలో వుండే థ్రిల్‌ని కాస్తా పెళ్ళి హరించివేశాక మొగుడూ పెళ్ళాలు "యూ బ్రూట్ అంటే యూ బ్రూట్" అనుకోకుండా ఎట్లావుంటారు? దేర్‌ఫోర్, మన ముందు జనరేషన్‌వారు ప్రేమలో వుండే థ్రిల్‌నంతా అనుభవించేసి జుర్రవలసినదంతా జుర్రి లేటు వయసులో చేసుకుంటె పెళ్ళి చేసుకుం టారు లేకపోతే అదీలేదు. మనుష్యులు చాలా సెల్ఫ్‌సెంటరడు మరియు దొంగ రాస్కెల్సయిపోయి పెళ్ళిళ్ళు ఎగేస్తారు. ఆధునిక వైద్యసౌక ర్యములు అభివృద్ధి చెందడం వలన చిల్లరమల్లర ఎడ్‌జస్టుమెంట్లు

డబ్బు సహాయంతో జరిపించుకోగల్రు. క్రమంగా కులాలకు మతాలకు ప్రాముఖ్యం తగ్గిపోయి డబ్బు అంతస్తులు, హోదాలతో ఏర్పడ్డ దొంగ విలువలు పైకి తన్నుకొచ్చేస్తాయి. ఎవరు ఎవరికి ఎంతవరకు ఉపయోగిస్తారు, ఎవరిఅవసరం ఎవరికి ఎంతవరకు వుంటుంది అన్నదే పాయింటుగాని, చిన్నా పెద్దా, తల్లా తండ్రా, అన్నా అక్కా యివేవీ కన్సిడర్ చెయ్యరు. అవసరం తీరాక ఎవర్నయినాసరే హాట్ పొటాటోలాగ విడిచేస్తారు. కుటుంబమర్యాదలు, పెద్దాచిన్నా తారతమ్యాలు బే ఆఫ్ బెంగాల్లోగాని గంగలోకాని కలిసిపోతాయి. దిసీజ్ భవిష్య పురాణం.

ప్రేమకథల్లో యింత బిట్టర్‌నెస్ ట్రెచరీ దాగొని వుండగా, హీరోయిన్ కోకమీది పువ్వులూ, చుక్కలూ, చారలూ చూసి నేలమీద పరచిన గడ్డినీ స్టుడియోలోని వెన్నెలను చూసి, హీరో బుష్‌షర్టూ, నొక్కులజుట్టూ, నేపథ్యసంగీతం విని ఇది లవ్ ఇన్ లబ్బీపేట ఆర్ బందర్ రోడ్డు అనుకోవడం చాలా కష్టం!

ఐ టెల్యూ దీజ్ సిన్మాస్ "లవ్" ని "మ్యారేజీ" ని విడగొట్టలేక రెంటినీ కలిపేసి కైమా చేసిపారేస్తున్నాయి, ప్రేమ ఎప్పుడయినా పుట్టును— ఎవరి మీదైనా జనించును. అది ఎక్కడైనా పెరుగును. రూపాయల మళ్ళువేసి చల్లిన సినిమావాడి ఒడిలోనే అది పెరుగునా? అది మిడిల్ క్లాసువాని సొత్తుకాదు. అది రిక్షావాని ఎదలోనైనమా, గుమస్తా, స్టూడెంటు, కంట్రాక్టరు మరియు ఇంజినీరు, హోటలు సెర్వరు, షావుకారు, పైలటు, లాండ్రీమాన్, అప్పలమ్మ దానికూతురు గంగి దాని కోడలు రంగి దాని మనవరాలు లవంగి వారి ఎదలోపలి ఎదలో పయ్యెదలో జనించిన ప్రేమ కోటి మాణిక్యవీణలను మీటును. ఈ ప్రేమ బూర్జువా హృదయములలోనూ శోషలిస్టు హృదయములలోనూకూడా ప్రకాశించును. ఇది భూస్వామ్య నాగరికతయందును పెట్టుబడిదారీ పారిశ్రామిక నాగరికతయందును వికసించును. ఇది సర్వసాంఘిక ధర్మములను జియోపారడైజు చేయును.

ప్రేమ హాట్ పొటాటోలాగుంటే కుర్రవాళ్లు చేతిలోంచి జార విడుస్తారు. దుమ్ముకొట్టుకుపోయిన ప్రేమ మన్నుగొట్టుకుపోతుంది. ఈ ప్రేమ చెడ్డవాళ్ళకు సుఖాలూ, మంచివాళ్ళకు కష్టాలూ తెచ్చిపెడుతుంది. హీరోచిత కృత్యాలతో సినిమాలలో పొదగబడిన ప్రేమలో జబర్దస్తీ హెచ్చు. తక్కువ తరగతి జనం అలగా మనుష్యుల గుండెలలో పొంగిపొర్లే ప్రేమ అది జనతా క్లాసు ప్రేమ. కొండొకచో ఎంకీ, నాయుడుబావల వరకూవచ్చి ఆగవచ్చు. పాకెట్ బుక్స్‌లోనూ, సాంఘికచిత్రాలలోనూ, సీరియల్సులోనూ కొట్టవచ్చినట్లు కనపడే లవ్ ఇన్ న్యూస్ ప్రింట్ — లవ్ ఇన్ సెల్యూలాయిడ్ జాగ్రత్తగా పరిశీలిస్తే.... ఈ ప్రేమ అనే వింతజంతువు, బీద కథలకి బీద బొమ్మలూ ప్రేమకథలకి ప్రేమబొమ్మలూ వేయించుకుని, పాటల మాటల గడపలెన్నో దాటి సంప్రదాయంమీద దెబ్బకొట్టి వీధిలోకొచ్చి జైకొట్టడానికి బదులు పెళ్ళి పందిట్లో మూడుముళ్ళు వేయించుకుని, గ్రూప్‌ఫొటోతో ఆఖరవుతోంది. ఆర్టిస్టులు కుంచెతో ఖూనీచేసినట్లే కథకులు కలంతో ప్రేమను ఒకపోటు పొడుస్తూవుంటారు, ఈ పోటు తినలేక మనలేక జీవితంలో అట్టడుగున దాక్కొని అంతర్వాహినిలా కనపడకుండా ప్రవహిస్తూ జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. బ్రాందీలాగ దాన్ని రోజూ పట్టిస్తానంటే కుదరదు. అది రెండు అట్టలమధ్య బంధింపబడదు. అది చావదు. చితిమీదసైతం స్మృతి రూపంలో నిలచే వుంటుంది. ప్రేమ బిట్టర్‌గా వుంటుంది. రొమాన్స్ బట్టర్‌లా వుంటుంది. బట్టర్ బిట్టర్‌గా వుండదు. మనం లవ్ ఇన్ లబ్బీపేట మరియు బందర్ రోడ్డులో చేసేది బట్టర్ సరుకే గాని బిట్టర్ సరుకుకాదు.

రొమాన్స్ కమ్మగా, తీయగా, ఖరీదెక్కువగా, డబ్బుకి దగ్గరగా మనసుకి దూరంగా వుంటుంది. ప్రేమ అలాక్కాదు. అది ముట్టుకుంటే కాలుతుంది. పరమచేదు కాలకూట విషం.... పైది బజార్లో సరసమైన ధరలకు లభించును. రెండో దానికోసం వెతక్కండి. అది వుండే

చోటు మీకు తెలియదు. మీరు దాన్ని గుర్తుపట్టలేరు. ప్రయత్నిస్తే దొరకదు. అది దొరికిన వాళ్ళని మీరు అదృష్టవంతులనుకోరు. కాని వన్ థింగ్ దానికి బ్యూటీకీ అట్టే సంబంధంలేదు. కొంచెం నూనె మిఠాయి సరుకైనా సినిమాల్లో, కథల్లో, నవలల్లో దొరికే లవ్ ఇన్ లబ్బీపేట మరియు బందర్ రోడ్డుతో తృప్తి పడాల్సిందే. నో గాడ్ విల్ హెల్ప యూ !